



ఉమాదేవి

శ్రావణమాసం.... వర్షఋతువు ప్రారంభ సమయమే ఐనా వర్షాలు ఆషాఢ మాసంనుంచే మొంచి ముమ్మరంగా ఉన్నాయి. అదేమో యీ సంవత్సరం అకాలంలో కురిసిన మురికి వానలమూలాన రైతులందరికీ దెబ్బే! ఊడ్చిన పొలాలే ఊడవాల్సిరావటాన సన్నకారు రైతులంతా లేవలేకండా దెబ్బతిని పడిపోయారు.

అయినా జరిగే పనులు జరిగి పోతూనే ఉన్నాయి. శ్రావణ మంగళి గౌరిని ముత్తైదు పిల్లలంతా శ్రద్ధతో ఆరాదించటం ప్రారంభించారు. శ్రావణమాసం అంటే ఒకవిధంగా ఆడపిల్లలంతా ఎదురుచూస్తారు....అలాగే దసరాల కోసం ధనుర్మాసం కోసంకూడా నిరీక్షిస్తారు, పుట్టిళ్లకు రావచ్చని! అత్తింట్లో ఆరళ్ళు తప్పించుకుని కొన్నిరోజులైనా ప్రాణం హాయిమంటూ ఉందామని కొందరొస్తే—భర్తగారి ప్రయోజకత్వం డాబూ దర్పం యిత్యాదులు పుట్టింట్లో చూపుకుని మురవచ్చని కొందరొస్తారు! దేనినైనా నలుగురిలోకి తెచ్చుకుని పదిమందీ దాన్ని చూచి మెచ్చుకుని అంతరంగంలో ఈర్ష్యచెందే పక్షంలోనే స్త్రీ దృష్టిలో విలువ హెచ్చేమో! ఓ కొత్తనగ చేయించుకున్నా ఓ మంచిచీర కొనుక్కున్నా నలుగురికీ చూపి వారి అసూయలో తన సంతృప్తిని చూచుకుంటుంది.

అలాంటి అవకాశమే నేటికినేడు పద్మజకీ లభించింది పెళ్లిఅయాక యీ నాలుగేళ్ళుగా లేనిది యీసారి ఆఖరి సంవత్సరమని అయితే నేం మరి దేనికయినా గాని పిరాపురం వచ్చింది. రాకరాక ఇంటికివచ్చిన ఆడబడుచు-అందులో భర్తఆర్జనపరుడు కూడా అవుతున్నాడు అవటాన అటు లోకదూషణకు వెరిచీ సత్యవతి సవితి కూతుర్ని ఆప్యాయంగానే ఆదరించింది. చిరకాలంగా దూరమయిన పుట్టింటికి రావటం-అనుకోని విధంగా లభ్యమైన యీ ఆదరణా చూచి పద్మజ హృదయం పులకితమైపోయింది. ఒక్కొక్కటిగా తన కష్టాలన్నీ శ్రావణ మంగళ గౌరి దయవల్ల యిక తీరిపోయాయి కాబోలు అనుకుంది....

నిజంగా పెళ్లిఅయాక ఆయన్ను వదిలి యిన్నిరోజులుండటం ఇదే తొలిసారి పద్మజకు. తమ వివాహమేమీ ప్రేమ వివాహం కాదు. స్కూలుఫైనలు ముగించిన పద్మజ అందరమ్మాయిలూ అత్తింట్లో అడుగుపెట్టినట్లు తనూ బెరుకుతో భీతితో అడుగుపెట్టింది. అత్తమామలూ, ముగ్గురాడబడుచులూ యిద్దరు మరుదులూ ఉన్న సంసారంలో అందరి అభిమానమూ అనురాగమూ ఎలా సంపాదించగలనా అనే జంకుతోనే ప్రవేశించింది. అయినా తన అణకువతో, నేర్పుతో పుట్టింట్లో సవతితల్లి హృదయాన్ని చూరగొనలేక పోయినప్పటికీ అత్తింట్లో ప్రతివ్యక్తి హృదయంలోనూ స్థానాన్ని సంపాదించింది....ఇక భర్త నారాయణరావుకి తాను బహిఃప్రాణమే అయింది. ప్రేమించి పెళ్లాడినవారు

కథానిక

మటుకు ఇంతకంటే అధికంగాపొందే ఆనందం సౌఖ్యం వేరే ఏముంటుంది అనుకునేది పద్మజ.

వారికి ప్రస్తుతం లోపమల్లా ఒక్కటే-నారాయణరావుకు ప్రాక్టీసేమంత బాగాలేదు. వీధికి నలుగురు ప్లీడర్లు వెలిసిన యీ రోజుల్లో—మహా మహా కొమ్ములు తిరిగిన లాయర్లకే ప్రాక్టీసు అంతంత మాత్రంగా ఉంటే జూనియర్అయిన నారాయణరావుకి ఏమంత రాబడి ఉంటుంది? అందుకే అతని క్లాసుమేటు కామేశ్వరరావు ఎడ్వొకేట్ గా ఎన్రోలయిన ఆరునెలలకే ట్యుటోరియల్ కాలేజీ పెట్టుకున్నాడు ....ఆ ఊళ్లో యింకా చాలా మంది లాయర్లు సాయంత్రం వేళల నలుగురైదుగురు పిల్లల్ని చేర్చుకుని ట్యూషన్లు చెప్పుకుంటున్నారట కూడా! కమలాకరరావేమో సర్వీసు కమిషన్కు వెళ్ళి సెక్రటెరియిట్ లో క్లర్కుగా జేరిపోయాడు—నెల కింత అని స్థిరాదాయం కంటికి కనిపిస్తుందనే ఆశతో....

పద్మజ తన భర్త ఏ మునసబుగానో సబ్ మేజిస్ట్రేటుగానో వెళ్తే బాగుంటుందనుకునేది ఎప్పుడూ....ఆ మాట గట్టిగా అనచ్చు — కాని తనకు ప్రాక్టీసు లేదని ఆమె అనుకుంటున్న దని ఆయనెక్కడ ఫీలవుతాడోనని ఎక్కువగా చెప్పలేకపోయేది!

ఆమె అప్పుడప్పుడూ సూచనగా అన్న మాటల ఫలితమే ఐతేనేం తనకూ తోచటానేమి ఆ యేడు సబ్ మేజిస్ట్రేటు సెలక్షనుకు వెళ్ళటమూ తన ప్రతిభవల్ల వెంటనే సెలెక్టు అవటమూ కూడా జరిగాయి....

అందరూ పద్మజ అదృష్టాన్ని ఎన్నోవిధాల పొగిడారు కోడలి అదృష్టమే యిదంతా అని ఆనందించారు అత్తమామలు. సెలెక్టయినట్టు తెలిసిన కాగితాన్ని తీసుకొచ్చి ఆ రోజాయన అత్తా మామా ముందుగదిలో ఉంటే సరాసరి తన గదిలో కొచ్చి తనను చేతుల్లోకి తీసుకుంటూ.

''పద్మా—యిదంతా నీ అదృష్టమే సుమా. లక్ష్మిలాగా నా యింట్లోకి వచ్చావు-నా జీవితాన్నే లక్ష్మీమయం చేసేశావు. నిన్నెలా ఆరాధించుకోవాలో....'' అన్నారు ప్రేమతో.

అప్పుడు తానేమనుకుంది?

''ఇంతటి అనురాగమూర్తి భర్తగా అంతటి కరుణా స్వరూపులను అత్తమామలుగా పొందటం అదృష్టంకాక మరేమిటి?'' అనిపించింది

''ఈ అదృష్టమే జన్మజన్మాలకూ గూడా యివ్వుతండ్రీ'' అని మనసారా కోరుకుంది!

ప్రేమతో పతిముఖాన్ని చేతుల్తో పుణుకుతూ

''నాదేముందండీ? .... మీ ప్రతిభ అది. ప్రతిభావంతుడు ఎప్పటికైనా రాణించక తప్పదు. మీరు యింకా యింకా వృద్ధిలోకి రావాలి....హైకోర్టు జడ్జీ అవాలి మీ హృదయంలో సుస్థిరమైన స్థానం నాకిస్తే చాలదూ—మరేం కావాలి?'' అంది అతని హృదయానికి తలను ఆన్చి ఒక్కొక్కమాటే అనురాగరసంలో ముంచుతూ....

నిజానికి నారాయణరావు ఎంతో తెలివైన వాడు ప్రతి క్లాసూ తప్పకుండా రావటమేకాక డిస్టింక్షన్తోనూ, రేంకులతోనే వచ్చాడు. ప్రాక్టీసు లేకపోతే అతడుమాత్రం ఏంచేస్తాడు? బి. ఎల్. లో యూనివర్శిటీ ఫస్టేవచ్చాడు.కానీ తక్షణ ప్రయోజనం ఏదీ కనిపించలా మరి.... యీ సారి సబ్ మేజిస్ట్రేట్ గా సెలెక్టవటంతో అణగిపోయినట్లున్న ఆత్మవిశ్వాసం తిరిగి కొంచెం తలెత్తి మరి కాస్త విజృంభించింది.

♦ ♦ ♦

''పద్మా! యిదో మరో విశేషం—విన్నావా?'' అంటూ వచ్చాడు నారాయణరావు. బుజ్జికి పాలుపడుతూ ఉన్న పద్మజ ఏమిటన్నట్లు ప్రసన్నవదనంతో భర్త ముఖంలోకి చూచింది.

"స్పెషల్ ఐ. ఏ ఎస్ సెలెక్షన్లట....ఇరవై అయిదేళ్ళు దాటిన వాళ్ళనే తీసుకుంటారట.'' ఆశగా ఆమె వైపు చూస్తూ మనసులో ఉజ్వల భవిష్యత్ని ఊహించుకుంటూ అన్నాడు.

ఆక్షణంలో అతని కన్నుల్లో వెలిగే ఆశాజ్యోతినిచూస్తే అతని ఊహాలోకంలో ఎన్ని సుందర సురుచిర చిత్రాలున్నాయో తెలిసిపోతుంది.

అతనికేసి చూచింది పద్మజ. తనకూ ఎంతో కాలంనుంచి ఐ. ఏ. ఎస్. మీద మోజులేక పోలేదు....మొదటిసారిగా ఆ ఊళ్ళో కాలేజీడే జరుగుతోంటే పక్కింటి శారదరమ్మని బలవంతం చేస్తే వెళ్ళింది....అధ్యక్షత వహించింది కలెక్టరుగారట. బహుమతులు పంచిన వ్యక్తి ఆయన భార్యేనట! ఎంత అందంగా ముచ్చటగా ముద్దుగా ఉన్నారాజంట! ఆమె కూడా ఎం. ఏ. దాకా చదివిందట. చాలా చిన్నవాళ్ళే యిద్దరూను. ఆయన ఐ ఏ ఎస్. అని వింది. "ఎంత అదృష్టం ఉండాలి అలాంటి దాంపత్యం లభ్యమవటానికి" అనిపించింది పద్మజకు ఆ క్షణంలో....తన భర్త అన్ని పరీక్షలలో ఫస్టుక్లాసులోనే గదా పేసయింది ఆయనమటుకు ఐ ఏ ఎస్‌కి వెళ్ళకూడదూ ఎంచక్కా తనూ యిదిగో యీమెలా దర్జాగా సరదాగా...ఏమిటేమిటో .. అనుకుంది....ఆ రాత్రి ఎంతో ఉత్సాహంతో అతనితో చెప్పింది

"ఏమండీ... మీరుకూడా ఐ ఏ ఎస్. కు కట్టరాదూ? బి ఏ చాలుటగదా మీరు బి ఎల్ కూడా అయితిరయ్యె" అంది లాలనగా భార్య ఆలోచనకి మెచ్చుకుంటూ నవ్వుతూనే నిస్పృహతో నిరాశతో "లాభంలేదు పద్మా—పేరుకి డిగ్రీ చాలన్న మాటేగాని బి ఏ. స్టాండర్డులో ఉంటాయి అన్నీ అయినా మరో ఆరునెలల్లో యిరవై అయిదు సంవత్సరాలు దాటిపోతున్నాయి కూడా నాకు యింక వ్యవధేదీ.. " అన్నాడు తనూ నిరాశతో ఊరుకుంది.

మళ్ళీ యీరోజు యింతకాలానికి ఎంత మంచివార్త!

ఆమె కళ్ళు ఆనందంతో మిలమిలా మెరిసిపోయాయి.

"నిజంగానేనా! ఎంతటి అదృష్టమండీ ఆలోచనతో కాలం వృధాచేయక యీసారన్నా కట్టేయండీ. ఏమో మన బుజ్జిగాడి అదృష్టాన మీరు అందులోగూడా నెగ్గకూడదా! సబ్ మేజస్ట్రేటుగా సెలక్టవలేదూ—అలాగే యిదీ అవచ్చు. ఏమండీ? సరేనా?" అంది బుజ్జిగాణ్ణి మంచం మీద పడుకోబెట్టి దగ్గరకువస్తూ. వాడు గిలక్కాయతో ఆడుకుంటున్నాడు.

"ఏంరా నానీ? నాన్నగారు కలెక్టరవుతార్రా నీవు కలెక్టరుగారి అబ్బాయివి. నువ్వో గవర్నరువయిపోవాలి....నా బుజ్జి తండ్రి నిజంగా దశమంతుడు—అందుకే పుట్టిన మూడో నెలకే నాన్నగారు సబ్ మేజస్ట్రేటయారు—ఆరోనెలకే స్పెషల్ ఐ.ఏ.ఎస్. రిక్రూట్‌మెంట్ వచ్చింది" అని బుజ్జిగాణ్ణి తన్మయత్వంతో ముద్దులాడింది.

భార్య సంతోషం చూచి నారాయణరావు నేత్రాలు ఆనందంతో చెమ్మగిల్లాయి. దగ్గరకు వెళ్లి పాపాయిని తీసుకుని ముద్దెట్టుకున్నాడు.

"ఇది నీదికాదురా అబ్బీ-అమ్మ అదృష్టం! ఆమె మనపాలిటి అదృష్టదేవతరా బుజ్జీ!" అంటూ ఉంటే యీ మాట లేవీ అర్థం కాకపోయినా బుజ్జి బోసినవ్వులు ఒలకపోశాడు

♦ ♦ ♦

నోములకు పుట్టింటికి వెళ్ళాలని ఏ మూలో ఉన్నా ఎందుకో వెళ్లాలని ఏమంతగా ఉత్సాహపడలేదు పద్మజ అత్తింటికి వచ్చినప్పటినుంచీ పుట్టింటి ఊసే తలచుకోనీయకుండా ప్రేమతో చూచే అత్తగారూ-పుట్టింట్లోనైనా ఆ సవతి తల్లేగా-అంతకంటే యీ అత్తగారే వెయ్యిరెట్లు నయం ఆమె పెట్టిన బాధలు తలుచుకుంటేనే కడుపు చెరువయ్యేది పద్మజకు తీరా తండ్రి వచ్చి అడక్కఅడక్క నాలుగేళ్ళ తరువాత కూతుర్ని పుట్టింటికి పంపమని మొట్టమొదటసారిగా అడుగుతూ ఉంటే హృదయం ఉండి, ఆడపిల్లల్ని కన్న ఏ తల్లిదండ్రులు ఖండితంగా 'పంపము' అంటారు? అప్పటిదాకా వెళ్ళవద్దనుకుంటున్న పద్మజకు కూడా మనసు కదలింది. ఒక్కసారి వెళ్లి చిన్ననాడు ఆడుకొన్న పరిసరాలూ తను చదువుకొన్న హైస్కూలు ఎప్పుడూ వెళ్ళే మాధవ మందిరం అన్నీ చూడాలనిపించింది. తనతో ఆడుకొన్న శశిరేఖా, ఇందిరా ఏం చేస్తున్నారో....బుజ్జిగాణ్ణి చూపాలి వాళ్ళకు....తండ్రితో బయలుదేరింది ఆ సాయంత్రమే

"పాపం! ఎంతనుకున్నా తండ్రికదా, ఆడపిల్లలకి పుట్టింటిమీది మమకారం ఎలా పోతుందో? ఆ తల్లే ఉంటే యీపాటికి ఎన్ని

సార్లు వెళ్లేదో కదా!'' అనుకొంది అత్తగారు హృదయంకల వ్యక్తి కాబట్టి.

''ఏమండీ? మీరు యీమధ్యలో వస్తూ ఉంటారు కదూ - అశ్రద్ధచేయక వెంటనే ఐ. ఏ. ఎస్. అప్లికేషను పెట్టి, ఆ సంగతి నాకు ఉత్తరం రాస్తారు కదూ'' అని అడిగింది, పద్మజ ప్రేమగా అతని మెత్తని క్రాపుని వేళ్లతో సవరిస్తూ.

''నీ కెందుకూ నా సంగతి? వెళ్తున్నావుగా పుట్టింటికి-నే నేమైతే నీకేం?''అన్నాడు కోపంగా ముఖం అటు తిప్పుకొని ఎటో చూస్తూ.

చిన్నబుచ్చుకొని ''మీకు కష్టంగా ఉంటే వెళ్ళను. పెళ్లి అయి కాపరానికి వచ్చిన ఇన్ని సంవత్సరాలకి మావాళ్ళకి ఇంత కటాక్షం కలిగి పిలుస్తూ ఉంటే ఆడపిల్లని కాబట్టి ఏదో మనసలా పీకింది. మీకు ఇష్టం లేకపోతే ఇప్పుడే నాన్నతో చెప్పివస్తాను రానని—'' అంటూ వెళ్లిపోబోయింది పద్మజ.

ఆమెను గబుక్కున పట్టుకుని ఆపేసి దగ్గిరకి లాక్కుంటూ,

''పద్మా-నీవు లేకపోతే నాకు పిచ్చెత్తినట్లు అవుతుందేమో - అందుకని ఆ బాధకొద్దీ అన్నానుగానీ పాపం పిలవక పిలవక మీవాళ్లు నిన్ను పిలిస్తే వెళ్ళవద్దనేటంత మూర్ఖుణ్ణా నేను! తప్పకుండా వెళ్లిరా. ఉత్తరాలు మటుకు రోజు విడిచి రోజు పెద్ద పే....ద్దవి రాస్తూ ఉంటావు కదూ'' అన్నాడు నారాయణరావు.

పద్మజ సంతోషంతో ''అలాగే....మరి ఐ. ఏ. ఎస్. మాట—''

''మర్చిపోనులే—'' అంటూ బైటికి తీసు కొచ్చాడు.

♦ ♦ ♦

ఎల్లుండి వరలక్ష్మీ వ్రతమనగా ఆ ఉదయమే దిగిన నారాయణరావుని చూచి పద్మజ పొందిన ఆనందం వర్ణనాతీతం. ఎంతసేపూ ఐ. ఏ. ఎస్. ముచ్చట్లే. కలెక్టరయాక జీవితం ఎలా ఉండ బోయేదీ కాసేపు మధురాతి మధురంగా ఊహించుకుని నవ్వుకున్నారు. మధ్యాహ్నానికే పయాణంకట్టిన భర్తనిచూచి అడిగింది పద్మజ.

''ఇంకొక్కపూట ఉండండీ .... ఎన్నాళ్ళో అయినట్లుగా ఉంది మిమ్మల్నొదిలి. రేపు వెళ్లురుగానిలెండి....'' అని ప్రాధేయపడింది.

''ఏమిటి పద్మా .... అవతల అప్లికేషను టైము దాటిపోతోంది. త్వరగా వెళ్లి డిపార్టు మెంటు ద్వారా పంపుకోవాలో లేదో చూచుకుని అప్లయ్ చేసి తిరుగు ప్రయాణంలో ఆగుతాను రెండు రోజులు .... శుక్రవారం రాత్రికి వస్తే సరిగా....''

విధిలేక ఒప్పుకుంది పద్మజ. ఆ రోజు కాలేజీలో చూచిన కలెక్టరు దంపతుల స్థానంలో తమను ఊహించుకుని అనిర్వచనీయానం దంతో పరవశత్వం చెందింది.

నారాయణరావిచ్చిన వైరందుకుని శ్యామం స్టేషనుకి వచ్చాడు. అతడు అక్కడే హైకోర్టులో ప్రాక్టీను మొదలెట్టాడు. కాలేజిలో నారాయణ రావు కితడు సీనియర్. పదకొండు గంటలకు భోజనంచేసి యిద్దరూ బయలుదేరారు ఊరి లోకి. అవసరం అనుకున్న పెద్దలందరితో మాట్లాడారు. నారాయణరావు అప్లికేషను పంపేందుకు కావలసిన ఏర్పాట్లన్నీ పూర్తి చేసు కున్నారు.

''రాత్రిబండికే వెళ్తానోయ్ శ్యామూ. వచ్చిన పని అయిపోయిందిగా....'' అన్నాడు బరువు దిగిపోయిందనే భావంతో నారాయణరావు.

''అదేమిటిరా. రాకరాక వచ్చి మరోరోజుంద కుండా వెళ్తానంటావు. రేపు పోవచ్చులే'' అని బలవంతం చేశాడు శ్యాము

''కాదురా. మరోసారి వస్తాగా మీ మరదలు నాకోసం ఎదురుచూస్తూ ఉంటుంది రేపు. ఒక్కపూట ఉండమని బ్రతిమాలుతూ ఉంటే యిక్కడ అప్లికేషనుకు టైమవుతుందని ఉండ కుండా వచ్చాను....ఈ సారికి వదలక తప్పదు. అవునుగాని పద్మజ గుంటూరు జరీచీరలంటే యిష్టం. అవి ఏవయినా కొనుక్కు వెళ్దామని ఉంది. పోదామా?'' అన్నాడు.

''సరే ఈ లోగా కాస్త హొటలుకు వెళ్ళి ఆత్మారాముణ్ణి శాంతింపజేసుకుందాము. తరు వాత చూచుకోవచ్చు నీ షాపింగు వ్యవహారం'' అని బయలుదేరదీశాడు శ్యాము.

ఇండియా కాఫీ హౌస్‌కి వచ్చారిద్దరూ. దూరమయినా ప్రత్యేకించి అక్కడికే వస్తాడు శ్యాము ప్రతిరోజూ.

అక్కడ కట్‌లెట్ తీసుకుని కాఫీతాగి బైటికి వచ్చారు. అలా అలా తిరిగి ఏ. సి. కాలేజీ, జనరల్ హాస్పిటల్, ఉడిపీ హొటల్ అవన్నీ దాటి రైలుగేటు దగ్గిరికి వచ్చారు. సరిగ్గా అప్పుడే గేటు వేశారు. గుంటూరులో యిదో బాధ. మాటిమాటికీ వచ్చేపోయే రైళ్ళమూలాన గేటు వేయాల్సి వస్తుంది. మంచి రద్దీగల సెంటరేమో ట్రాఫిక్ కొద్ది నిమిషాలు బందయినా యీ చివరనుంచి ఆ చివరదాకా అన్నీ పేరుకు పోతాయి.

శ్యాముకు యిదంతా వినుకు మాట్లాడకుండా పక్కగేటులోంచే వెళ్తాడెప్పుడూ యీ రోజూ అలాగే వెళ్దామని అతడు ముందు దోవ తీశాడు....తరువాత మరి నలుగురు వెళ్ళారు. ఇంతలో అటు మాచర్లబండ వచ్చేస్తోంది. అక్కడ సాధారణంగా ఇటు నరసరావుపేట వైపు బండీ అటు మాచర్లబండి ఒకే సమయంలో వస్తాయి. ఒక్కొక్కప్పుడు పోటీ పడినట్లు వడుస్తాయికూడా. నారాయణరావు మిత్రుణ్ణి కలుసుకోవాలనుకున్నాడుగానీ అతనికాగేటువేసినప్పుడు వెళ్ళటం అలవాటులేదు. అందుకే తారట్లాడాడు వెళ్ళటమా మానటమా — అని దూరాన్నించి.

"రావోయ్—ఆడపిల్లలా అంత జంకేమిటి? రైలు కదులుతున్నా ఎక్కటం దిగటం చేసే మగజాతిలో పుట్టి అంత పిరికితన మేమిటి?" అంటున్నాడు శ్యాము. మొండిగా ముందుకి వెళ్ళాడు నారాయణరావు....గబుక్కున మాచర్ల బండి సమీపించేసరికి భయంతో వెనక్కి నాలుగైదడుగులు వేశాడో లేదో నరసరావుపేట బండి గుద్దేసింది....

అంతే! ఆ క్షణంలో ముసలితనంలో కాలు పెడుతోన్న తల్లిదండ్రులూ, ప్రేమతో ఆరాధిస్తూ తన సర్వస్వమూ తనే అనుకున్న భార్యా, గారాబు పట్టీ....సబ్‌మేజిస్ట్రేటు పనీ, ఐ.ఏ.ఎస్. హెూదా .... ఏమీ కళ్ళకు కనిపించలేదు, క్షణికం! తృటిలో అంతా రక్తం....రక్తం.... రక్తం! రైళ్ళాగిపోయాయి. జనం పోగయ్యారు. అదుర్దాతో శ్యాము వెనక్కువచ్చి కీడు శంకించే హృదయంతో మిత్రునికోసం జనసమూహాన్ని కలయజూస్తూనే రక్తపు మడుగులోని కళేబరాన్ని చూచి కెవ్వుమన్నాడు .... తక్షణమే పిఠాపురం ఒకటీ విశాఖపట్నం ఒకటీ వైర్లిచ్చాడు.

వైరందుకున్న తల్లిదండ్రులూ యిటు పద్మజ కుప్పకూలిపోయారు.

"ఎంత దురదృష్టవంతుడివిరా బుజ్జీ....లేదు, ఇది నా దౌర్భాగ్యమే నాయనా....నేనే ఆ పాడు ఐ. ఏ. ఎస్‌కు బలవంతాన పంపించాను. అనుకుంటూ మేమేదొరికామా తల్లీ యిలా పరీక్షించటానికి" అనుకుంది అప్పుడే తెలివి వచ్చిన పద్మజ....ఇదేమీ పట్టకుండా నవ్వుకుంటూ ఆడుతున్న బిడ్డను బాధగా హృదయానికి హత్తుకుంటూ—సంతత ధారాపాతంగా కారే కన్నీటిగుండా శ్రావణ గౌరివైపు కసిగా చూస్తూ!

---

పరువు ప్రతిష్ఠలు గల పెద్దమనిషి ప్లీడరుగారి సహాయంతో వీలునామా తయారు చేయిస్తూ, అందులో తన ప్రత్యేకమైన అభిమతాన్ని ఒకదానిని యిరికించవలసిందని కోరాడు: పెద్దమొత్తాలు తనకు అప్పు పెట్టిన నలుగురు స్నేహితుల పేర్లు ఉదహరిస్తూ, తన మరణానంతరము వాళ్ళే తన శవ వాహకులుగా ఉండాలని.

"అదేమిటీ వాళ్ళే ఎందుకు ఉండాలి?" అని ప్లీడరుగారి ప్రశ్న.

"పాపం యింతవరకూ పడిపోకుండా నన్ను మోసుకొస్తూన్నారు. ఆఖరి ప్రయాణం కూడా వాళ్ళే చేయించేస్తే మంచిది."